## దివ్యాంగులు రాయితీ బస్సు పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, మే31 ప్రభాతవార్త:** దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బస్సు పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరం పేటలోని బస్టాండ్‌లో నిర్వహించిన దివ్యాంగుల బస్సు పాస్‌ల పంపిణీ మేళాలో పాల్గొని అర్హులైన వారికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా రాయితీ బస్సు పాస్‌లను పంపిణీ చేశారు. తెలంగాణ ఆర్టీసీ అందిస్తున్న ఈ సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం దివ్యాంగుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ వాటిని సద్విని యోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ బస్సు పాస్ మేళాలో దాదాపు 30 మంది దివ్యాంగులకు రాయితీ బస్సు పాస్‌లను అందజేసినట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళీ పంతులు, రైతుబంధు అధ్యక్షు లు సురేష్‌గౌడ్, నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, సూపర్‌వైజర్ వీఆర్‌వో పాండు, నారాయణ ఖేడ్ డివిజన్ నాయకులు పరమేష్, బాసిత్, ఆర్టీసీ సిబ్బంది చంద్రశేఖర్, నర్సింలు, సాయిలు పాల్గొన్నారు.




## యువకుల దాడితో వ్యక్తి మృతి

**ఝరాసంగం, మే 31, ప్రభాతవార్త:** మహిళపై అసభ్యంగా ప్రవర్తించడాన్న కోపంతో ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జునేగావ్‌లో మంగళవారం రాత్రి చోటు చోటుచేసుకుంది. జహీరాబాద్ రూరల్ సిఐ వెంకటేశ్ కథనం ప్రకారం వివారలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బేగరి ఎల్లయ్య (50) ఈ నెల 29న రాత్రి 8 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన బేగరి అనుషమ్మ (40)తో అసభ్యంగా ప్రవర్తించాడని అనుషమ్మ బంధువు నాని విషయాన్ని అనుషమ్మ కుమారుడు బేగరి రమేష్‌కు చెప్పగా నాని, రమేష్‌లు 30 తారీఖున రాత్రి 11.40 గంటల ప్రాంతంలో తన ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న ఎల్లయ్యపై కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. ఎల్ల య్యపై జరిగిన దాడిని గమనించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఎల్లయ్య మృతి చెందినట్లు డాక్టర్ దృవీకరించారన్నారు. ఎల్ల య్యపై దాడి చేసి చంపిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు బి నాగ య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వివరించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

**సిద్దిపేట టౌన్, మే 31, ప్రభాతవార్త**

తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జూన్ 2న తెలం గాణ అవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుం దన్నారు. దశాబ్ధి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చే ప్రజలకు ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రంగదాం పల్లి అమరవీరుల స్థూపం వద్ద చుట్టూ రంగులు వేసి పూలతో అందంగా ముస్తాబు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను అదేశించా రు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అందరి సమన్వయంతో వేడు కలను అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాల న్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, అడిష నల్ డీసీపీ మహేందర్, తహశీల్దార్ విజయ సాగర్ తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి పోలీసు యాక్ట్ అమలు

**ఎస్‌పి రమణకుమార్, జిల్లా ఇంచార్జి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి**

**సంగారెడ్డి టౌన్, మే 31, ప్రభాతవార్త:** జిల్లాలోని ఆయా గ్రామా ల్లో జూన్ 1వ తారీఖు నుంచి 30వ తారీకు వరకు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి యం రమణకుమార్ పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటన లో ఎస్‌పి కథనం ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా పోలీసుల అనుమతి పొందకుండా జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ సమావేశాలు, సభలు నిర్వహించరాదని హెచ్చరించారు. ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని సూచించారు. జిల్లా ప్రజలు సంగారెడ్డి పోలీసులకు తమ వంతు సహకరించాలని ఎస్‌పి రమణకుమార్ వివరించారు.

### మెదక్ జిల్లా వ్యాప్తంగా..

**మెదక్ అర్బన్, మే31 ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జూన్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఇంచార్జి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరస నలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వ హించరాదని తెలిపారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు త మకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, మే 31, ప్రభాతవార్త:**

ధాన్యం కొనుగోళ్లలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోళ్ల తదితర విషయా లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరో జు 50 లారీలకు తగ్గకుండా కొనుగోలు కేంద్రాలకు పంపాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం లారీల నుండి ఖాళీ చేయ కుండా జాప్యం చేస్తున్న రైస్ మిల్లర్లపైన ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై న చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. తరలించిన ధాన్యంను వెంట వెంటనే లారీల నుండి ఖాళీ చేయించాలని కేంద్రా ల సూపర్‌వైజర్లకు ఆదేశించారు. ట్రాన్‌ఫోర్టు లారీల కాంట్రాక్టర్లకు తగిన మొత్తం ఇచ్చి లారీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తహాశీల్దార్లు, రవాణా అధికారులు, పోలీసులు అధికారులు, వాహన ఇన్స్‌పెక్టర్లు రాత్రి పగలు అనే తేడా లేకుండా వాహనాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిలువలు లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఎక్కడా నిర్లక్ష్యం వహించినా సహించబోమని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీ బోస్ రాజుకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అభినందనలు

**మెదక్ మున్సిపాలిటీ, మే31 ప్రభాతవార్త:**

ఏఐసీసీ కార్యదర్శి. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి ఎన్‌సీ బోస్ రాజు కర్ణాటక క్యాబినెట్‌లో మైనర్‌ఇరిగేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా నియమించబడిన సంద ర్భంగా వారిని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం బెంగళూరులో వారి స్వగృహంలో కలిసి అభినందనలు తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా బోస్ రాజు మాట్లా డుతూ తెలంగా ణలో కూడా అన్ని సర్వేల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానా లు వస్తున్నాయని, కర్ణాటక మాదిరిగానే తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎక్కువ సమయంలో తెలంగాణలో ఉంటానని ఆయన తెలి పారు.

# దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం

## సిద్దిపేటను రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుదాం : మంత్రి తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** టి.రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ను సిద్దిపేట నియోజకవర్గంలో వైభవంగా నిర్వహించి.. వే డుకలను రాష్ట్రానికే అదర్శంగా నిలుపుదామని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి అడిటోరియంలో బుధవారం దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై నియోజకవర్గస్థాయి సన్నాహక స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతిని చాటేలా వేడుకలను ప్రతి పల్లె..పట్టణాల్లో పండుగ వాతావరణంలో జరపాలన్నా రు. దశాబ్ద కాలంలో శతాబ్ది అభివృద్ధి సాధించామని నాడు ఉద్యమంలో ముందున్నాం..నేడు అభివృద్ధిలో ముందున్నా మని.. సిద్దిపేట అభివృద్ధికి అధ్యాయన కేంద్రంగా మారిం దన్నారు. 21 రోజుల దశాబ్ది ఉత్సవాలను పండుగలో ప్రజలను భాగస్వామ్యం చూస్తూ..నాడు నేడు సిఎం కెసిఅర్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రభు త్వం సాధించిన ప్రగతి తెలిస్తేనే అనుకున్న కార్యక్రమం సఫ లీకృతం అవుతుందని అవగాహన కోసమే ఈ దశాబ్ది ఉత్స వాలు అన్నారు. కలలో కూడా ఊహించని పనులు కలలో కూడా రాని పనులు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకు న్నామన్నారు. మాతృశిశు మరణాలు తగ్గి దేశానికే అదర్శం గా నిలిచామని..నేడు 14వ స్థానం నుంచి 3వ స్థానానికి చేరుకున్నామన్నారు. తెలంగాణ కంటే ముందు తరా ్వత పరిస్థితిపై నాడు నేడు మీద ప్రజలకు సవివరంగా వివరిద్దా మన్నారు. నిజం ప్రచారం చేయకపోతే అబద్దాలు రాజ్యమే లుతాయని..దీంతో ప్రమాదకరమైన పరిస్థితులు వస్తాయని డాక్టర్ బి.అర్.అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. మన ప్రభుత్వం చెప్పిన పనులను ప్రజలకు వివరించాలన్నారు. సాగునీటి దినోత్సవం సందర్భంగా రంగనాయకసాగర్ వద్ద సంబరాలను ఘనంగా చేద్దామన్నారు. సిఎం కెసిఅర్ పుట్ట బోయే బిడ్డకు న్యూట్రీషన్ కిట్, పుట్టిన బిడ్డకు ఇచ్చేది కెసి అర్ కిట్ అని ఇది కెసిఅర్‌కు ప్రజలపై ఉన్న ప్రేమ అన్నా రు. జూన్ 22 చివరి రోజున నియోజకవర్గ పరిధిలో జన రల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ అమర వీరు ల పోరాటం పట్ల 2నిమిషాలు మౌనం పాటిద్దామన్నారు.

### కిరణ్‌కుమార్‌రెడ్డి చీకట్లో మగ్గుతుంటే తెలంగాణ వెలుగుల్లో విరాజిల్లుంతుంది




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

ఉమ్మడి అంధ్రప్రదేశ్ చివరి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డిపై మం త్రి హరీష్‌రావు అనాటి వ్యాఖ్యాలు గుర్తు చేస్తూ విరుచక పడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే చీకటి మయం అవుతుందని అనాడు కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారని నేడు అయనే చీకట్లోకి వెళ్లిపోయారని గుర్తు చేశారు. కిరణ్‌కుమా ర్‌రెడ్డి చీకట్లో మగ్గుతుంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వెలుగులతో విరాజిల్లుతుందన్నారు. కిరణ్‌కుమార్ చీకట్లో ఉన్నారు తెలంగాణ వెలుతురులో ఉందన్నారు. మనకు చీక టి కాలేదని కిరణ్‌కుమార్‌రెడ్డికి మాత్రం చీకటి అయ్యిందన్నా రు. అనాటి పరిస్థిత ఎలా ఉందో నేటి పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, మున్సిపల్ చైర్మన్ మంజుల, ఎంపిపిలు కూర మాణిక్యరెడ్డి, శ్రీదేవి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వంగ నాగిరెడ్డి, జిల్లాలోని అన్నిశాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దశాబ్ది ఉత్సవాలను పండువగా నిర్వహించాలి

## ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, మే31 ప్రభాతవార్త:** రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావ రణంలో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. 21 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను మహా యజ్ఞంలా భావించి అధికా రులు, ప్రజాప్రతినిధులు సమిష్టి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. 2014 కు పూర్వం, తెలంగాణ ఏర్పడ్డ తరువాత తొమ్మిదేండ్లలో రాష్ట్రం అన్ని రంగాలలో సాధిం చిన గణనీయ ప్రగతినిఇ ప్రతిబింబేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బుధవారం క్రిస్టల్ గార్డెన్‌లో మెదక్ నియోజకవర్గంలో దశాబ్ది ఉత్సవాలు సమర్థవంతంగా నిర్వహిం చుటకు గాను విధివిధానాలు ఖరారు చేయుటకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికా రులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, నియోజకవర్గ ఇంచార్జి ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ రమేష్, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా పాటిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో పడ్డ కష్టాలు, రాష్ట్రం వచ్చాక దశాబ్ద కాలంలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. జూన్ 2 నుండి 22 వరకు రోజు ఒక కార్యక్రమం చొప్పున చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంలో నాడు నేడు సాధిం చిన ప్రగతిపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ఫ్లెక్సీల ద్వారా తాజా పరిస్థితులపై అద్దం పట్టేలా ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల్లో రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ చాలా పెద్ద కార్యక్రమాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా సమన్వ యంతో పనిచేస్తేనే కార్యక్రమాలు విజయవంతమవుతాయని అన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ప్రతి మండలానికి ప్రజాప్రతినిధులను ఇంచార్జిలుగా నియమించాలన్నారు. తొమ్మిది సవత్సరాలు కష్టపడితే రాష్ట్రం సాధించిన ప్రగతిని, సంక్షేమం, అభివృద్ధి రెండు కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంతో ఇంటి పండుగలా పని చేయాలని, జూన్ 22 వరకు ఎవరు విశ్రమించరాదని కోరారు. రైతు దినోత్సవం రోజు నియోజకవర్గంలోని 25 రైతు వేదికలు శోభాయ మానంగా అలంకరించాలని, వేయి మందితో సభ ఏర్పాటు చేయాలని, పంట కాలం ఒక నెల ముందు జరుపుటపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. సాగునీటి దినోత్సవం సందర్భంగా ఇరిగేషన్ శాఖ నుండి చెరువుల వద్ద మహిళలతో బతుకమ్మ, బోనాలు, కట్ట మైసమ్మ కార్యక్రమాలు, వన భోజనం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడు తూ దశాబ్ది ఉత్సవాలపై మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాల నిర్వహణ తీరు, బాధ్యతలపై అవగాహన కలిగిం చాలన్నారు. రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ పెద్ద కార్యక్రమాలని, చక్కటి కార్యాచరణ ప్రణాళికతో ముదుకెళ్లాలని అన్నారు. వేయి మందితో నిర్వహించే రైతు దినోత్సవానికి రైతు వేదిక సరిపోకపోతే ప్రక్కనే ఏర్పాటు చేసుకోవాలని, మూడు రోజులు వేదికలను మామిడి తోరాణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. ఊరూరా చెరువుల పండుగ రోజు ప్రతి గ్రామ పంచాయితీలోని ఒక పెద్ద చెరువు వద్ద సాయంత్రం 5 నుండి కార్యక్రమాలు నిర్వహించాలని, గోరేటి వెంటన్న పాటలు ప్లే చేయాలని అన్నా రు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఎక్కడ, ఎలా నిర్వహించే తీరుపై ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, జిల్లా అధికారులు, డీఎస్పీ సైదులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయితీ కార్యదర్శులు, వ్యవసా యాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను నిండా ముంచుతున్న కేంద్రం నిర్వాహకులు

**-కిలోకు బదులు 5 కిలోల తరుగు**

**-హామాలీ రూ.25 బదుల 35 వసూలు**

**కంది, మే 31, ప్రభాతవార్త:** అందరికి అన్నం పెట్టే అన్నదా తులు ఆగం అవుతున్నా అధికారులకు పట్టకపోవడం విస్మయా న్ని కల్గిస్తోంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని మండల కేంద్రంలో రైతులు దగా పడుతున్న సంఘటనపై రైతులు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరా ల్లోకి వెళితే... మండల కేంద్రమైన కందిలోని సొసైటీ ఆధ్వ ర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశారు. కేంద్రంకు ధాన్యం తరలిస్తున్న రైతులను కేంద్రం నిర్వాహకులు నిండా ముంచుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రంకు తరలించిన ధాన్యం బస్తాలను తూకం వేయకుండా 42 కిలోలుగా నమోదు చేసుకుంటూ మోసం చేస్తున్నారని, క్వింటాలు ధాన్యం నుంచి ఒక కిలో మాత్రమే తరుగు తీయా లని ప్రభుత్వం సూచిస్తున్నా కేంద్రం నిర్వహకులు మాత్రం క్విం టాలు ధాన్యం నుంచి ఏకంగా 5 కిలోల తరుగును తీస్తున్నారని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. హమాలికి గాను 25 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా 35 రూపాయలను వసూలు చేస్తూ రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. తమకు కల్గుతున్న కష్టన ష్టాలపై నిర్వాహకులను ప్రశ్నిస్తే బెదింపులకు పాల్పడుతూ ధా న్యం తీసుకోవడంలో మూడు నుంచి 5 రోజుల వరకు వేచి ఉం డేలా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు రైతులు మండిపడు తున్నా రు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే రైతులను దగా చేస్తున్నా ఉన్నతాధికారులకు పట్టకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్వాహకులు పెడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్గుతున్న ఇబ్బందులపై సీఈఓ శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా తరుగు 5 కిలోలు, హమాలీ 35 రూపా యలు తీసుకుంటున్నట్లు తెలిసిందని పేర్కొనడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రైతులకు కష్టాలు, నష్టాలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు.

# వరికొయ్యలను తగులబెడితే దెబ్బతింటున్న భూసారం

## శాస్త్రవేత్తలు రైతులకు హెచ్చరిక

**పాపన్నపేట, మే 31, ప్రభాతవార్త:** గతంలో కొడవళ్లతో వరిని మొదళ్ల వరకు కోసే వారు. ప్రస్తుతం యంత్రాలు అందుబాటులోకి రావడంతో మొదళ్ల వరకు కాకుండా 25 నుంచి 30 సెంటీమీటర్ల ఎత్తులో కోస్తున్నారు. దీంతో గడ్డి కొయ్య కాళ్ల రూపంలో పంట అవశేషంగా మిగులుతోంది. వీటిని రైతులు మడిలోనే తగులబెడుతున్నారు. ఇది పర్యా వరణ కాలుష్యానికి కారణమవుతుంది. కాల్చడం వల్ల అపా ర నష్టాలున్నాయంటూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారు లు పదేపదే చెబుతున్నా మెజార్టీ రైతులు వినకుండా వరి కొ య్యలను కాల్చుతూనే ఉన్నారు. తద్వారా తాను తీసు కున్న గొయ్యిలో తానే పడ్డట్లు అవుతుంది. ఈ విధానం వల్ల ప్రకృతి దెబ్బతినడమేకాదు అన్నదాత అన్ని రకాలుగా నష్టపోతున్నాడు. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చని పోవడమే కాకుండా సారవంతమైన భూమి దెబ్బతినడంతో దిగుబడిపై కూడా ప్రభావం చూపుతోంది. వాతావరణ కలుషితమవుతుంది. అప్పట్లో దొడ్డినిండా పశువులు ఉం డడం వల్ల వాటి మేత కోసం గడ్డిపోచను కూడా విడిచిపె ట్టకుండా కొడవళ్లతో వరిని మొదళ్ల వరకు కోసేవారు. ఎం డబెట్టి కుప్పవేసి ఏడాదంతా పశువులకు మేతగా ఉపయో గించే వారు ఇప్పుడు పశువులు లేకుండా పోయాయి. రైతు లకు గడ్డి అవసరం లేకుండాపోయింది. వరికోత యంత్రా లు వచ్చిన తదుపరి గడ్డిని కుప్పవేసే రైతులను వేళ్లపై లెక్కపెట్టే పరిస్థితులు వచ్చాయి. మారిన ప్రపంచీకరణ నేప థ్యంలో ప్రస్తుతం రైతులు వరిపంట కోతకు యంత్రాలను వినియోగిస్తున్నారు. పంటకు పంటకు మధ్య సమయం తక్కువ ఉండడంతో వరికోసిన తర్వాత మిగిలిన కొయ్యకా ళ్లు, వరిగడ్డిని కంపోస్టుగా మార్చుకోవడంపై రైతులకు అవగాహన లేకపోవడంతో పొలంలో ఉన్న కీటకాలను, వ్యాధికారక జీవులు నశింపజేయవచ్చన్న అపోహతో చాలా మంది రైతులు వరికొయ్య కాళ్లను, గడ్డిని తగులబెడుతు న్నారు.



వరి కొయ్యలు కాల్చుతున్న రైతులు

### తగులబెట్టడం వలన అనేక కష్టాలు

వరికొయ్యలను తగులపెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. ఉత్తర భారతదేశంలో ఈ కారణంగా శీతా కాలంలో తీవ్రస్థాయిలో కాలుష్య సమస్యలు ఎదుర వుతున్నాయని ఇప్పటికే అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నా యి. సాధారణంగా సూక్ష్మజీవులు పంటకు వేసే ఎరువు లను మొక్కలకు అందిస్తాయి. కానీ కొయ్యలను తగులపెట్ట డంతో అవి చనిపోవడంతో రైతులు వేసే ఎరువులు మొక్కకు అందే అవకాశం లేకుండాపోతుంది. కొయ్యకాళ్లను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయ కర్బనం, కార్బన్‌డై అక్సైడ్‌గా మారి వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడానికి కారణమవుతోంది. పొగ, ధూలికణాలు గాలిలో కలవడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. అలాగే పొలాల్లో తిరిగే ముంగిసలు ఉడుములు నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోతున్నాయి. ప్రకృతి సమతుల్యత దెబ్బ తింటుంది. ఇది సాగుకు ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

### కలియ దున్నినా.. కుప్పపెట్టినా.. బంగారమే

వరిపంట కోసిన వెంటనే కొయ్యకాళ్లను తగులబెట్టకుండా పొలంలో మిగిలిన తేమను ఉపయోగించుకుని దున్నాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దున్నడం వల్ల కొయ్యకాళ్లు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. తద్వారా సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఇలా చేయడం వల్ల వేసవిలో నేలలో పగుళ్లు రాకపోవడంతో తేమ ఆవిరి కావడం తగ్గి తొలకరిలో పడిన వర్షపునీరు నేలలోకి ఇంకి పోవడం ద్వారా నేలకోతకు గురికాకుండా ఉంటుంది. ఒక టన్ను వరి గడ్డి కావాలంటే ఆ వరి పెరుగుదలకు 18.9 కిలోల పోటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మపోషకాలు అవసరం అవుతాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే గడ్డి ద్వారా పోషకాలన్ని తిరిగి నేలకు చేరతాయి. లేదా ఈ పంట అవశేషాల వ్యర్థాలను కంపోస్టు చేయడం ద్వారా సేంద్రియ ఎరువుగా తయారు చేసుకోవచ్చు. వానా కాలంలో దమ్ము చేసేటప్పుడు ఎకరానికి 50 కిలోల సూప ర్ ఫాస్ఫేట్ వేస్తే నేలలో మిగిలిపోయిన వరికొయ్యలు తొందరగా కుళ్లిపోతాయి. తర్వాత నాటే వరి పంటకు నేల ద్వారా పోషకాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధానం పై ఆయా మండలాల్లో వ్యవసాయ అధికారులు అవగాహ న కల్పిస్తున్నా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోనే కాక జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

## రాష్ట్ర అవతరణ ఉత్సవాలను పకడ్బంధీగా నిర్వహించాలి

**కలెక్టర్ అధికారులకు ఆదేశం**



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, మే 31, ప్రభాతవార్త:**

రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వ హించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాటుపై నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులు, సూప ర్‌వైజరీ సభ్యులతో కలెక్టర్ శరత్ తన చాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జూన్ 2 నుండి 22 వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర అవ తరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయా లని ఆదేశించారు. నియోజకవర్గం వారిగా ప్రభుత్వ పథకాల లబ్దిదారుల వివరాలు అందజేయాలని తెలిపారు. నియో జకవ ర్గంలో ఉత్సవాలు జరుపుటకు అనువైన వసతులను పరిశీ లిం చాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫంక్షన్ హాల్స్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించా రు. ఉత్సవాలకు తరలివచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పా టు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ ఎల్ల య్య, డిఎంఅండ్‌హెచ్‌ఓ గాయత్రి, డిఎం సివిల్ సప్లై సుగుణ భాయి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ జార్జ్

**పెద్దశంకరంపేట, మే31 ప్రభాతవార్త:**

ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు మండల పరిధిలోని రామోజిపల్లి గ్రామంలో ప్రజ లకు కమ్యూనిటీ కనెక్టివిటీ ప్రోగ్రామ్ కింద అవగాహన కల్పించారు. సైబర్ నేరా లు, ఆన్‌లైన్ మోసాలు, షీ టీం, డయల్ 100 సేవలు, రహదారుల ప్రమా దాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం, డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అటవాటు పడితే జీవితంలో జరిగే దుష్పరి మానాలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. గ్రామాలలో తప్పనిసరిగా సీసీ కమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమెరాల 100 మంది పోలీసు లతో సమానమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గ్, టేక్మాల్ మండలాల ఎస్ఐలు బాలరాజ్, సత్యనారాయణ, ప్రవీణ్‌రెడ్డి, ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్

## ముదిరాజ్ సభను విజయవంతం చేయాలి

**-సంఘం రాష్ట్ర యూత్ కన్వీనర్ జగన్**

**పెద్దశంకరంపేట, మే 31 ప్రభాతవార్త:**

మెదక్‌లో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న ముదిరాజ్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర యూత్ ప్రధానకార్యదర్శి జగన్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పల్లె బోయిన పున్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మెదక్‌లో 1ఎకరా 20 గుంటల్లో నిర్మించే నూతన ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. 50 లక్షల మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి ముదిరాజ్ బంధువులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి గోపాలకృష్ణ, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పల్లెబోయిన పున్నయ్య, గౌరవ అధ్యక్షులు శంకరయ్య, సర్పంచులు లక్ష్మీనర్సింలు, కవిత రమేష్, నరేష్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మేరు కులాన్ని చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం

**-కాంగ్రెస్ పార్టీ మండల యువత అధ్యక్షులు దర్జి రాజు**

**కొల్చారం, మే31 ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ ప్రభుత్వం మేరు కులాన్ని చిన్నచూపు చూస్తుందని కాంగ్రెస్‌పార్టీ మండల యువత అధ్యక్షులు దర్జి రాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాలను ఆదుకుంటామంటూ మేరు కులాన్ని గుర్తించడం లేదన్నారు. ఇప్పుడు అన్ని కుల వృత్తులకు లక్ష రూపాయలు ప్రకటించిందని, అందులో మేరుకులం లేదన్నారు. ప్రభుత్వ గెజిట్‌లో పొందుపరచిన మేరు కులాన్ని బీసీడీ నుండి బీసీఏకు మార్చి రిజర్వేషన్లు మేరు కులానికి అదేవిధంగా చూడాలన్నారు. మేరు కుల వృత్తి దారులకు మేరుబంధు ద్వారా వెంటనే లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మేరు ఫెడరేషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటుచేసి వనరులు కేటాయించాలని, కొన్ని కులాలకు ఇస్తున్న విధంగా మేరు కుల వృత్తిదారుల టైలర్ షాప్‌లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు.

## ఏకగ్రీవంగా జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికలు

**అధ్యక్షుడిగా రవీందర్, ప్రధానకార్యదర్శిగా దామోదర్‌చారి**

**మెదక్ మున్సిపాలిటీ, మే 31 ప్రభాతవార్త:**



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన రవీందర్, దామోదర్‌చారి

జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికలు బుధవారం పట్టణంలోని కాళికా దేవి ఆలయంలో ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికలకు నామినేషన్ బుధవారం సాయంత్రం 4 గంటలకు చివరి రోజు కావడంతో అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు కేవలం ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా మారింది. ఎన్నికల్లో అధ్యక్షుడిగా మెదక్‌పట్టణానికి చెందిన పూన రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రామాయంపేటకు చెందిన సుంకోజు దామోదర్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పూనా రవి మాట్లాడుతూ స్వర్ణకారులందరికీ అందుబాటులో ఉండి సంఘం అభ్యున్నతికి పాల్పడతానన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు నూతన అధ్యక్ష,కార్యదర్శులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా సాయిసిరి వ్యవహరించగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వింజమూరి రాఘవాచారి, చేపూరి వెంకట స్వామిలు విచ్చేయగా పట్టణ అధ్యక్షులు చదువుల రమేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, లక్ష్మీకాంతంచారి, బ్రహ్మచారి, ఉపేందర్‌చారిలతో పాటు స్వర్ణకార సంఘం డెలిగేట్ సభ్యులు పాల్గొన్నారు.

## మైనారిటీ కార్పొరేషన్ నిధుల విడుదలలో జాప్యం

**కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్**

**మెదక్ మున్సిపాలిటీ, మే 31 ప్రభాతవార్త:**

మైనార్టీ కార్పొరేషన్ నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మెదక్ బ్లాక్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధ వారం మెదక్ పట్టణలో విలేకరులతో మాట్లాడారు. మైనార్టీ కార్పొరేషన్ నిధుల విడుదలలో కేసీఆర్ ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నాలుగు నెలలుగా మైనార్టీ నిరుద్యోగ యువత విడుదల కోసం ఎదురు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు వెయ్యి మందికి పైగా నిరుద్యోగ యువకులు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన వివరించారు. ఒక్కొక్కరు వెయ్యి రూపాయలకు పైగా ఫీజు చెల్లించాలని ఆయన తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీలకు రుణాలు తక్షణమే విడుదలయ్యేవని గుర్తు చేశారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి

**కీసర, మే 31 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుదవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని సైలెంట్ ఎవెన్యూ కాలనీలో కనకదుర్గా మాత దేవస్థానానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేయడానికి సీఎం కేసీఆర్ ఎన్నో కోట్ల నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సంపనబోలు స్వప్న హరిగౌడ్, మాదిరెడ్డి పావనిరెడ్డి, కొత్త హేమలతశ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవతా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం

**బొంరాస్‌పేట, మే 31 ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం నాందార్‌పూర్ గ్రామంలో ఆయుదాలపల్లి ఆభయాంజనేయ స్వామీ ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. మొదటిరోజు సోమవారం ప్రత్యేకపూజలు, రెండవరోజు మంగళవారం మంటపారాధన, విహిత హవనములు, వుహస్నపనము, శయ్యధాన్యాధివాసములు, మంత్రపుష్పస్వస్తి వంటి పూజలు నిర్వహించారు. అనంతరం దేవత విగ్రహాలను ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగింపు నిర్వహించడంతో మహిళలు నీటి బిందెలతో జలాభిషేకం, మూడవ రోజు పండుగ వాతావ రణంలో విగ్రహప్రతిష్టాపన, ధ్వజస్తంభం, బొడ్రాయి, నవగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాందార్‌పూర్ గ్రామప్రజలు, పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# కంటి వెలుగుతో పేదలకు లాభం

**-అభివృద్ధి పనుల పరిశీలన**
**-ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి**

**కొడంగల్, మే 31ప్రభాతవార్త**

తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో పేద ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సంగాయపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో కంటి పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం లబ్దిదారులకు కంటి అద్దాలను ఎమ్మెల్యే స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో అంధత్వం లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు కంటి అద్దాలతో పాటు అసవరం ఉన్న వారికి కంటి శస్త్ర చికిత్సలు కూడా ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలంతా కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బిచ్చిరెడ్డి, చిన్నలతో పాటు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల పరిశీలిన:**

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడుతు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సొంతం చేసుకున్నామని, అదేవిధంగా త్వరలోనే ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇళ్ళు మంజూరీ చేస్తామని, కుల వృత్తులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నాయకులు నవాజ్, వెంకటయ్య, దస్తప్ప, రమేష్‌బాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగు కార్యక్రమంలో కళ్ళ అద్దాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

# మూడుచింతలపల్లి మండలంలో మంత్రి మల్లారెడ్డి సుడిగాలి పర్యటన

**-వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు**



జగ్గంగూడ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, పాల్గొన్న ఎంపిపి వి.హారికమురళీగౌడ్, సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, ఉపసర్పంచు బుద్ధి శ్రీనివాస్, వార్డుసభ్యులు, అధికారులు

**శామీర్‌పేట, మే 31, ప్రభాతవార్త**

మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం ఉదయం మూడుచింతలపల్లి మండలంలోని పోతారం, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, ఆద్రాస్‌పల్లి, జగ్గంగూడ గ్రామాల్లో మంత్రి మల్లారెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సుమారు 62.65లక్షల రూపాయలతో నిధులతో చేపట్టిన, చేపట్టె కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల ఎంపిపి వి.హారిక మురళీగౌడ్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, తహసీల్దార్ వాణిరెడ్డి, డిఇ వేణుగోపాల్, ఎఎంసి వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామాల సర్పంచులు వంగ హరిమోహన్‌రెడ్డి, జామ్ రవి, సింగం అంజనేయులు, వై.అనురాధరవీందర్‌రెడ్డి, బి.లలిత నర్సింలు, సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపిటిసిలు పి.నాగరాజు, జి.హన్మంతరెడ్డి, మరి కొందరు, సొసైటీ డైరక్టర్ ఎల్.నర్సింలుగౌడ్, మరి కొందరు, కీసరగుట్ట ధరకర్త సభ్యులు నాగరాజుగుప్త, మండల సీనియర్ నాయకులు జి.హరిమోహన్‌రెడ్డి, ఎన్.విష్ణుగౌడ్, మంద స్వామి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ప్రతిభింబించేల దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

**-జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు,ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

**ఇబ్రహీంపట్నం, మే 31, ప్రభాతావార్త:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత జరిగిన అభివృధ్ధిని ప్రతిభింబించేల దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు,ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుదవారం మండలం పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2న అవతరణ దినోత్సవ కార్యక్రమం, 3న రైతు వేదికల్లో అవతరణ దినోత్సవం, 4న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్ష దివాస్, 5న విద్యుత్ విజయోత్సవం, 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూర చెరువుల పండగా, 9న తెలంగాణ సంక్షేమ సంబురాలు, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజోత్సవం, 18న తెలంగాణ మంచినీళ్ల పండగా, 19న తెలంగాణ హరితోత్సవం, 20న తెలంగాణ విద్యాదినోత్సవంలో బాగంగా ప్రతి పాఠశాలలు, కళాశాలలు ముస్తాబు చేసి జెండాలు ఎగువవేసి అదేవిదంగా విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించి, విద్యార్థులకు యునిఫాంలు అందజేయాలని తెలిపారు. మన ఊరు-మన బడిలో పనులు పూర్తయిన పాఠశాలల్లో ప్రజాప్రతినిదులతో ప్రారంబోత్సవాలు చేయించాలని అధికారులను ఆదేశించారు. 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా గుడి, మసీదులు, చర్చిలును అలంకరించి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేల చూడాలని అధికారులకు చెప్పారు. 22న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటాచారి, అటవి రెంజ్ అధికారి విష్ణువర్ధన్ రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ కరుణాకర్‌బాబు, డిఈ యాదగిరి, తహసీల్దార్లు అనితారెడ్డి, అనిత, ఎంపిడిఒలు శ్రీనివాస్, అనితాబాయి, క్రాంతికిరణ్, విజయలక్ష్మి, మున్సిపల్ కమీషనర్లు అమరేందర్ రెడ్డి, యూసుఫ్, సత్యనారాయణ రెడ్డి, సాబేరలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మెన్ చంద్రయ్య, జడ్పిటిసి జంగమ్మ తదితరులున్నారు.



దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

## ఎస్‌హెచ్‌ఓ మహేందర్‌రెడ్డికి బిఆర్ఎస్ పార్టీ సన్మానం



ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాసుగౌడ్ (సీఐతో ఆర్‌బిఎస్ సమన్వయకర్త అంజిరెడ్డి)

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.మహేందర్‌రెడ్డిని బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి సన్మానం చేశారు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు సీఐ మహేందర్‌రెడ్డి అందించిన సేవలను ఇక్కడ కూడా చేసి మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాక్షించారు. మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డిల ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌పార్టీ నాయకులు సీఐని, ఎస్ఐ అశోక్‌లను కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. మండల రైతుబంధు సమితి సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి అంతకంటే ముందు వచ్చి సీఐ మహేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి, బండారి అంజనేయులు, బేతాల నర్సింగ్‌రావు, సహకార సంఘం మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బర్ల హరిశంకర్, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

**-శంకర్‌పల్లి ఎంపిడిఓ వెంకయ్యగౌడ్**

**శంకర్‌పల్లి, మే 31 ప్రభాతవార్త:**

ప్రస్తుత రోజుల్లో యువతీ, యువకులు చదువుతో పాటు ఏదో ఒక క్రీడల్లో ప్రతి రోజు ఒక గంట సేపు ఆటలు ఆడుకోవడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని శంకర్‌పల్లి మండల ఎంపిడిఓ వెంకయ్య గౌడ్ అన్నారు. మండలంలోని మోకిలలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో గత నెల రోజులుగా జరుగుతున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం 2023 ముగింపు సందర్బంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొనగా ప్రథమ బహుమతి మోకిల, ద్వితీయ బహుమతి కొండకల్ తండా జట్లు విజయం సాధించాయి. వీరికి శంకర్‌పల్లి సిఐ ప్రసన్నకుమార్ చేతుల మీదుగా ప్రథమ బహుమతిగా రూ.12 వేల నగదు, ట్రోఫిని, ద్వితీయ బహుమతిగా రూ.8 వేల నగదు, ట్రోఫిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రీడ లు ప్రతి వ్యక్తికి నిత్య జీవితంలో భాగమని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులకు పోలీసు శాఖలో జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన కోటాను తెలంగాణ ప్రభుత్వం కేటాయించిందని, ఇందుకోసం యువత క్రీడల్లో బాగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నాటు సార స్థావరాలపై పోలీసుల దాడి

**ఇబ్రహీంపట్నం, మే 31, ప్రభాతావార్త:**

మంచాల మండలంలోని నాటు సార తయారీ స్థావరాలపై ఇబ్రహీంపట్నం ఎక్స్‌సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సిఐ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ యాదయ్య మండలంలోని బోడకొండ, ఆంబోత్ తండాలల్లో ఆకస్మిక దాడులు నిర్వహించగా 2.5లీటర్ల నాటు సారాను స్వాధినం చేసుకున్నారు. సారా తయారు చేయడానికి నిల్వ ఉంచిన 50లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి నోటీసులు అందజేసినట్లు పోలీసులు తెలిపారు.

## పశువులకు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**షాబాద్, మే 31. ప్రభాతవార్త :**

పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. షాబాద్ మండల పరిధిలోని తిర్మాలాపూర్ గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు వ్యాపించు గొంతువాపు నివారణ టీకాలను వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పశువులకు సీజనల్‌లో వ్యాధులు వ్యాపించి ఇబ్బందులకు గురి చేస్తాయని వాటిపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పశువులను నిర్లక్ష్యం చేయకుండా ఎలాంటి ఇబ్బంది ఉన్న వెంటనే పశువైద్య అధికారిని సంప్రదించి చికిత్సలు చేయించాలన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

## హైవే రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**-రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలి : కోడూరు కుమారి**

**శంషాబాద్ మే 31, ప్రభాతవార్త :** హైదరాబాద్ -బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి వద్ద రోడ్డు పనులను నత్తన డకలు నడిపిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బిజెపి శంషాబాద్ మున్సిపల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు కోడూరు కుమారి డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై కాంట్రాక్టర్ నిర్ల క్ష్యం కారణంగా పనులు నత్తనాడకన నడుస్తున్నాయని దీంతో ప్రజలు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 40 రోజులుగా ఈ ప్రాంతంలో ప్రజలకు నరకం చూపిస్తున్నారని ఎన్నిసార్లు విన్న వించిన కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మరో వైపు రోడ్డుకు ఇరువైపులా సమాంతరంగా వెడల్పు కార్యక్రమా లను చేపట్టాల్సి ఉండగా అధికారులు ఒక వర్గం వారికి చెందిన సమాధులను దర్గాలను తొలగించకుండా మరో వర్గం వారి స్థలాలను రోడ్డు కోసం తీసుకుంటున్నారని ఇదెక్కడి న్యాయ మని కుమారి ప్రశ్నించారు. తొండుపల్లి వద్ద జాతీయ రహదారి బిట్టి రోడ్డుకు అనుకొని సమాధులను పెడుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ఏ ఒక్క వర్గం వారి కోసం నిర్మించడం లేదని దీనివల్ల అందరికి ప్రయోజనం చేకూరుతుందని విషయాన్ని గమనించాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులకు మతాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు.

## మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**మేడ్చల్, మే 31, ప్రభాతవార్త :**

మేడ్చల్‌లో ఈ నెల 6, 7 వ తేదీల్లో జరిగే ఎఐటియూసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. ఏసుర త్నం, మందా వెంకటేశ్వర్లు కోరారు. మేడ్చల్ పట్టణంలోని బుధవారం ఎఐటియూసి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వ హించి మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఎఐటి యూసి నిరంతర ఉద్యమాలు చేపట్టిందని అన్నారు. చాలిచాలని జీతాలతో పని చేసి చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6వ, 7వ తేదీల్లో జరిగే మహాసభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిచంద్రన్, ఎఐటియూసి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర, మహా సభల అహ్వాన సంఘం కోశాధికారి జైపాల్‌రెడ్డి, ఎఐటియూసి మండల అధ్యక్షు డు జనార్ధన్‌రెడ్డి, నాయకులు రాములు, శేఖర్, అశోక్, శ్రీను, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి : సర్పంచ్



కొర్రెములలో జరిగిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్ గౌడ్

**ఘట్‌కేసర్ రూరల్, మే 31, ప్రభాతవార్త:**

పౌర హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామ సర్పంచ్ ఒరగంటి వెంకటేశ్ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ప్రధానంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ బాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ బొడ్డు వినోద, వార్డు సభ్యులు డి. ఆంజనేయులు, జువ్వ స్వామి, మాటూరి సుష్మ, పర్నాటి బాబు, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు నాగార్జున, మాటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు అందజేత



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్, మే 31, ప్రభాతవార్త :**

ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లికి చెందిన లావణ్యకు మంజూరైన రూ.42,500లు, వేణుకు మంజూరైన రూ.32,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మున్సిపల్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తున్నదని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకూడదని సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నదని తెలిపారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బాలరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, మహేష్, జగన్, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్‌కు 'ద లీడర్స్ పేజ్' సేవా అవార్డు



బిజెపి మున్సిపల్ అధ్యక్షులు హనుమాన్‌ను సన్మానించి ప్రశంసాపత్రం అందజేస్తున్న నర్సింహయాదవ్

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు విప్పర్ల హనుమాన్‌కు కరోనా యోధుని అవార్డు లభించింది. కోవిడ్-19 సమయంలో హనుమాన్ ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మానవసేవే మాధవసేవ అంటూ పలువురికి ఆదర్శంగా ఉండటంతో 'దలీడర్స్ పేజ్' సంస్థ ఆయన అందించిన సేవలను గుర్తించి కరోనా వారియర్‌గా కరోనా యోధుని అవార్డు ఇచ్చింది. ఈసందర్భంగా దలీడర్స్ పేజ్ సంస్థ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి నర్సింహ్మాయాదవ్ హనుమాన్‌ను శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి కూరపాటి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు కంభం లక్ష్మారెడ్డి, సీబీఎఫ్‌సీ సభ్యులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ ప్రధానకార్యదర్శి బొక్క రవీందర్‌రెడ్డి, నాయకులు వీరేశం, విక్రాంత్‌రెడ్డి, పల్లె శివ, సుభాషిణి, మాధవి, ఆశ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే నష్టపరిహారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**యాచారం, మే 31 ప్రభాతవార్త**

మండలంలోని మంతన్‌గౌరెల్లి, కెసి తండా గ్రామాల్లో గత మూడు నెలల క్రితం కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు ఇళ్ల రేకులు ధ్వంసం కావడంతో నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వపరంగా గ్రామ ప్రజలను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, మండల కమిటీ సభ్యులు, మాజీ ఎంపిటిసి తావునాయక్, చందు నాయక్, అమీర్‌పేట్ మల్లేష్, గడ్డం కుమార్, సిపిఎం పార్టీ నాయకులు నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

## గురుకులకు ఎంపికైన విద్యార్థులు

**కొడంగల్ రూరల్, మే 31 (ప్రభాతవార్త) :**

కొడంగల్ నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సంధ్యారాణి, సాయిసచ్చిదానంద, అద్వైత గురుకులకు ఎంపిక కావడంతో బుధవారం పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



గురుకులకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్



మాట్లాడుతున్న ఎంపిపి కీర్తన

## దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

**కొమురవెల్లి/తొగుట, మే 31, ప్రభాతవార్త :** దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఎంపిపి తలారి కీర్తన అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల పై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రాక ముందు ఈ ప్రాంతం ఎలా ఉండేది.. వచ్చిన తర్వాత ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అందరిపై ఉందన్నారు. జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అనురాధ, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, స్వామి, రమణారెడ్డి,ఎంపిఓ, వ్యవసాయ అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**తొగుటలో...**



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సిఎం కెసిఆర్ నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దశాబ్ది ఉత్సవాలలో ప్రజలకు వివరించాలని వైస్ ఎంపిపి బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసి విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కొమురయ్య, పిఎసిఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షులు బోదనం కనకయ్య, సర్పంచ్ కొండల్‌రెడ్డి, నర్సింలు, ఐజుల, ఇంచార్జి ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపివో చందన, ఎపిఎం ముగ్దుమ్ అలీ, ఎపిఓ కిషన్, ఎవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మిభీలునాయక్

**హుస్నాబాద్/అక్కన్నపేట :** హుస్నాబాద్,అక్కన్నపేట మండల కేంద్రాల లో దశాబ్ది ఉత్సవాలపై ఆయా మండలాల ఎంపిపిలు లకావత్ మానస సుభాష్, మాలోతు లక్ష్మిభీలునాయక్, అక్కన్నపేట జడ్పిటిసి భూక్య మంగ శ్రీనివాస్ సంబందిత అధికారులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. అక్కన్నపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి మండలంలో 30కిపైగా ఉన్న సర్పంచ్, ఎంపిటిసిలలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే హాజరుకావడంతో ఈ దశాబ్ది వేడుకలు మండల వ్యాప్తంగా సక్రమంగా జరుగుతాయా లేదా అనే ప్రశ్నకు తావునిస్తుంది. ఈ కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, హుస్నాబాద్ ఎంపిడివో కుమారస్వామి, ఎస్ఐ తోట మహేష్, ఎంపివో సత్యనారాయణ, అక్కన్నపేట తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపిడివో సత్యపాల్‌రెడ్డి, ఎంపివొ కవికుమార్, ఎంపిటిసి పెసరు సాంబరాజు, లింగాల శ్రీనివాస్, బైరి రవిందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం : మున్సిపల్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ మున్సిపల్ మంజులరాజనర్సు

**సిద్దిపేట టౌన్, మే 31, ప్రభాతవార్త :** దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని పట్టణ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 22 వరకు జరిగే ఉత్సవాల్లో అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని నిర్లక్ష్యంచేస్తే సహించేది లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పట్టణానికి ఎప్పటికపుడు పరిశుభ్రంగా వుండేలా చూడాలన్నారు. కోమటి చెరువు రుబీ నెక్లెస్ రోడ్ మరింత అందంగా ముస్తాబు చేయాలన్నారు. అలాగే ఎజెండా లో పొందుపరిచిన అంశాలను పాలకవర్గం ఆమోదించింది. సమా వేశంలో వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రతపై చైతన్య ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట టౌన్, మే 31, ప్రభాతవార్త :** మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ షెహార్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేయడానికి మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషర్ సంపత్‌తో కలిసి ప్రారంభించారు. ర్యాలీ గాంధీచౌరస్తా, ఆర్ అండ్ బీ అతిథి గృహం, ఆర్డీఓ కార్యాలయం, విక్టరీ చౌరస్తా మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, పట్టణ పరిశుభ్రత, పొల్యుషన్ అరికట్టలడానికి చేపట్టాల్సిన అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. పట్టణ పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ప్టణంలో చెత్తను అరు బయట వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.

## మల్లన్నసాగర్ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌పై కేసు

**కొండపాక, మే 31, ప్రభాతవార్త :** మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు కాలువ పనులు చేస్తున్న దత్తసాయి కంపెనీకి చెందిన ప్రాజెక్టు సూపర్‌వైజర్ సంపత్ కుమార్ రైతులకు పంట నష్టపరిహారం వచ్చిన తర్వాత పనులు చేసుకోవాల్సిందిగా వైస్ ఎంపీపీ దేవి రవీందర్ గ్రామ సభలో కొద్ది రోజుల క్రితం తెలపడ జరిగిందని కుకునూరుపల్లి ఎస్ఐ తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని దత్తసాయి కంపెనీ ప్రాజెక్టు సూపర్‌వైజర్ మేదినిపూర్‌కు చెందిన రమేష్‌రెడ్డి,వైస్ ఎంపీపీ దేవి రవీందర్‌కు కాలువ పనుల్లో వ్యక్తిగత లాభం చేకూర్చాలని అర్థికంగా సహాయం చేశాన తపస్‌పల్లి గ్రామస్తులతో అన్నందుకు దేవి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. కాలువ పనులు తప్పుదారి పట్టించడానికి సూపర్‌వైజర్ అనుచిత వ్యాఖ్యలు చేశాడన్నారు.

# రాష్ట్ర అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**



మాట్లాడుతున్న ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్, మే 31, ప్రభాతవార్త :** అత్యవసర సమయాల్లో పల్లె ప్రాంతాల్లో గ్రామసుంకరి చేత 'టముకు' వేయించి సమస్యనుకానీ విషయాన్ని కానీ ప్రజలకు ఇన్నాళ్లుగా చేరవేసిన విధంగానే ప్రస్తుతం గ్రామసుంకరుచే కాకుండా ఈ బాధ్యతను ప్రజాప్రతినిధులు నెత్తికి ఎత్తుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం నిర్వహిస్తున్న ఆవిర్భావ దినోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా దశాబ్ది ఉత్సవాలను ఆయా ప్రజాప్రతినిధులు గడపగడపకు తిరిగి చెప్పుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు చైర్‌పర్సన్ దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని సెంట్రల్ లైటింగ్‌పోల్స్ వద్ద తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధిని తెలియచేస్తూ ప్రజాప్రతినిధులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆకుల రజిత సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముందు ఎలా ఉన్నది ఏర్పాడ్డాక మారిన పరిస్థితులపై ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని వివరించారు. ఈ కార్యక్రమాలు పట్టణంలోని ప్రతీ వార్డులో జూన్ 2 నుండి 22 వరకు నిర్వహించాలని చెప్పారు. ఈ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ప్రజలను భాగస్వాములను చేయాలని ఆకుల రజిత ప్రజా ప్రతినిధులకు సూచించారు. ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో కౌన్సిలర్ కొంకట నళనీదేవిరవీందర్, వాల సుప్రజనవీన్‌రావు, బోజు రమాదేవిరవీందర్, కోమటి స్వర్ణలత సత్యనారాయణ, పెరుక భాగ్యారెడ్డి, భూక్య సరోజన, గోవిందు రవి, దొడ్డి శ్రీనివాస్, మ్యాదబోయిన వేణుయాదవ్, గూళ్ల రాజు, బొల్లి కల్పనశ్రీనివాస్, జనగామ రత్నమాలరవీందర్‌రావు, బొజ్జ హరీష్, కోఆప్షన్ సభ్యులు మహ్మద్ అయూబ్ పాషా, ఇంచార్జి కమిషనర్ సాయిప్రణీత్, కార్యాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్‌టియు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి



ఆటో యూనియన్ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీష్‌రావు

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బిఆర్‌టియు ఆటో యూనియన్ ముద్రించిన పోస్టర్లను మంత్రి హరీష్‌రావు బుధవారం రిమ్మనగూడ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో దళితబంధు అందని ఆటో డ్రైవర్లకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు మంజూరు చేయిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లకు ఉచితంగా లైసెన్స్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 4 వేల మందికి ఉచింగా యూనిఫాం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బిఆర్‌టియు ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, ప్రధానకార్యదర్శి బాల్‌రాజ్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు అంతని ఆసా, ఎస్‌కె.ఫరీద్, కరీం, సూరజ్, సాయిబాబా, పంజాల నర్సింహగౌడ్, రాజుచారి, సలీం, శ్రీనివాస్, స్వామి, జీవన్, శ్రీనివాస్, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**కొండపాక, మే 31, ప్రభాతవార్త :** వారం రోజులుగా రాజీవ్ రహదారిపై డివైడర్‌లో మొక్కలు తొలగిస్తుండగా దుబ్బాక ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన ఈరబోయిన లక్ష్మి కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ జాగృతి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ పరామర్శించి రూ.10వేలు అందించారు. మృతురాలి పిల్లల చదువులకు సహాయం అందిస్తానన్నారు.

## ముదిరాజ్‌ల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట



కొట్టాల యాదగిరిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

**వర్గల్, మే 31 (ప్రభాతవార్త):** పురాతన క్షేత్రాల నిర్వహణకు ధూపదీప నైవేద్య పథకం కింద రూ.10వేలు, పూజారులకు గౌరవ వేతనం కింద రూ.5 వేలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బిఆర్ఎస్ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరిముదిరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శాకారం వద్ద జరుగుతున్న పెద్దమ్మతల్లి కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలుచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల చల్లని చూపుతో పాడి పంటలు సమృద్ధిగా పండుతున్నట్లు పేర్కొన్నారు. ముదిరాజ్‌ల కుల దైవమైన పెద్దమ్మ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత నివ్వాలని, ముదిరాజ్‌ల సంక్షేమానికి సర్కార్ పెద్దపీటవేస్తూ చెరు వులు, కుంటలు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేపలు పట్టే పూర్తి హక్కులు కల్పించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు.కాగా పెద్దమ్మతల్లి ఆలయ నిర్వాహకులు చాగంటి కృష్ణ ఆధ్వర్యంలో కొట్టాల యాదగిరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్య క్షుడు శ్రీరామ్ నర్సింలు, నాచగిరి ఆలయ సభ్యులు పడిగె రాజు, నేతలు వెంకన్న, బోయిని కుమార్, సత్యనారాయణ, డాక్టర్ రాజు, లింగ భాస్కర్ పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.15వేల విరాళం

**వర్గల్, మే 31 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి బుధవారం రూ.15,116 విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ దేవతల చల్లని చూపుతో గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పొగాకుకు దూరంగా ఉండండి : వైద్యాధికారి

**చిన్నశంకరంపేట, మే 31, ప్రభాతవార్త:** పొగాకుకు దూరంగా ఉండాలని మండల వైద్యాదికారి సాయి సింధూ అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలోభాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సాయి సింధూ మాట్లాడుతూ పొగాకు వాడటం వలన చాలా అనారోగ్య సమస్యలు వస్తాయని, ధూమపానం చేయడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు, మరియు ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె పోటు వచ్చే అవకాశం ఉందని వివరించారు. ధూమపానంను మానుకోవడం వల్ల గుండె జబ్బుల సమస్యలు తగ్గుతాయని, క్యాన్సర్‌కి గురికాకుండా ఉంటారని తెలిపారు. అలాగే కొర్విపల్లి గ్రామంలో పొగాకుకు దూరంగా ఉండండి అనే ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిబిరాలు విద్యార్థులకు ఉపయోగకరం

**ఎంపిపి భాగ్యలక్ష్మిరెడ్డి**

**చిన్నశంకరంపేట, మే 31, ప్రభాతవార్త:** విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగకరంగా ఉన్నాయని ఎంపీపీ భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా యువజన క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మిరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని బుధవారం విజేతలకు బహుమతులను అందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ఎంతో అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కోచ్ ప్రశాంత్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి,అనిల్,శ్రీధర్,సతిష్,సాయి,తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల వివాహానికి పుస్తెలు, మెట్టెలు అందజేత

**కొల్చారం, మే31 ప్రభాతవార్త:**

ఇద్దరు పేదింటి ఆడబిడ్డల వివాహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి బుధవారం పుస్తె మెట్టెలను అందజేశారు. మండల పరిధిలోని వరిగుంతం గ్రామానికి చెందిన బ్యాగరి భాగ్యమ్మ, శేఖయ్య దంపతుల కుమార్తె సౌందర్య, నీరుడి రాములమ్మ, దుర్గయ్య దంపతుల కుమార్తె అర్చనల వివాహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు జంగంగారి శ్రీకాంత్‌గౌడ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే అధికారికి వినతి పత్రాన్ని అందిస్తున్న రైతులు

## రైల్వే గేటు ఏర్పాటు చేయాలి

**కొండపాక, మే 31, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి శివారులోని లక్ష్మి చెరువు నుంచి వెళ్తున్న రైలు పట్టాల వద్ద గేటు ఏర్పాటు చేయాలని రైతులు బుధవారం రైల్వే సీఈకి వినతి పత్రాన్ని అందించారు. రైలు పట్టాల అవుతల దాదాపు వెయ్యి ఎకరాల్లో వంద మంది పై చిలుకుగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నామని, వచ్చిపోయే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా వుండేందుకు ముందస్తుగా రైల్వే గేటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కార్యక్రమంలో కొంతం రాజు, అంజయ్య, కొండ స్వామి, సత్యం, మహేష్, రాములు తదితరులు వున్నారు.

## రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం : రామకృష్ణారెడ్డి

**వర్గల్, మే 31 (ప్రభాతవార్త):** ఆరుగాలం కష్టపడి పంటలను పండించే రైతుల శ్రేయస్సే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని వర్గల్ మండల పిఎసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేయడానికి వర్గల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు మండలంలోని 1115 మంది రైతుల నుండి సుమారు 52వేల క్వింటాళ్ళ ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఈఓ జితేందర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఎసిపి రమేష్‌ను సన్మానించిన రామకోటి రామరాజు



ఏసిపి రమేష్‌ను సన్మానిస్తున్న రామరాజు

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** గజ్వేల్ ఏసిపి మదత రమేష్‌ను బుధవారం శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో రామకోటి రామరాజు శ్రీసీతారాముల ఫొటోను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఏసిపి రమేష్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీరుస్తూ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్, అంతునూరి శివకుమార్, లాయర్ మర్కంటి శ్రీనివాస్, వేములవాడ కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం: ఎంపిపి

**దుబ్బాక, మే 31, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాలు జూన్ రెండు నుంచి 22వ తేదీ వరకు మండల స్థాయిలో ఘనంగా నిర్వహిస్తామని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖాల అధికారులతో కలిసి దశాబ్ది ఉత్సవాలపై ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 3వ తేదిన రైతు దినోత్సవం నిర్వహించాలని, మండలంలోని గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. మండలంలోని 10 రైతు వేదికల్లో క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో జరిగిన సంపూర్ణ ప్రగతి, రాష్ట్రంలో రైతులకు తీసుకువచ్చిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల వల్ల రైతులు పొందిన లబ్ధిని రైతులకు, ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు ఒక్క కార్యక్రమంతో 20 రోజులపాటు అనేక కార్యక్రమలు, నిర్వహించేందుకు అధికా రులు, ప్రజప్రతినిధులు, ముందుండి నడిపించాలన్నారు.సమీక్ష సమావేశంలో ఎంపిడి భాస్కర శర్మ, ఏఎంసి చైర్ పర్సన్ చింతల జ్యోతి, మండల పమన్వయ సమితి అధ్యక్షుడు వంగ బాల్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ శేర్ల కౌలాసం, వైస్ ఎంపిపి ఆస్క రవి, ఎంపివో నరేందర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పురపాలికలో దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశం

**దుబ్బాక, మే 31, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై పురపాలిక కార్యాలయంలో బుధవారం కౌన్సిలర్లు, అధికారులతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించినట్లు పురపాలిక ఛైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు దాదాపు 20 రోజుల పాటు జరగనున్నాయన్నారు. జూన్ రెండు నుండి 22 వరకు జరిగే ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మరో 2,796 దేవాలయాలకు ధూపదీప నైవేద్యం

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** ప్రస్తుతం రాష్ట్రంలో 3,645 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం వర్తిస్తుండగా మరో 2796 ఆలయాలకు ఈ పథకం వర్తింపజేస్తున్నట్లు సిఎం కెసిఆర్ ప్రకటించడం హర్షణీయమని సిద్దిపేట జిల్లా బ్రాహ్మణ సేవా వాహిని సంఘం అధ్యక్షుడు శేషం శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా ఆలయాల నిర్వహణ కోసం అర్చకులకు రూ.6వేలు అందించగా ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచడం జరుగుతుందన్నారు. అలాగే వేద పాఠశాలల నిర్వహణ కోసం ఇస్తున్న 2 లక్షలను ఇక నుండి యాన్యువల్ గ్రాంట్‌గా అందజేయడంతో పాటు ఐటిఎం, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదివే బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేయడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు.



శ్రీసీతారాముల శాంతి కళ్యాణాని ౧ తిలకిస్తున్న ఎఫ్‌డిసి చైర్మన్

## ఘనంగా శ్రీసీతారాముల శాంతి కళ్యాణం

**జగదేవ్‌పూర్, మే 31 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీకోదండ రామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీసీతారాముల విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఐదు రోజులుగా వైభవంగా జరుగుతుండగా బుధవారం శ్రీసీతారాముల శాంతి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ హయాంలో పురాతన దేవాలయాలకు మహర్దశ సంతరించుకుందని,శ్రీసీతారామచంద్రస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసర్పంచ్ దుబ్బాక కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు, జగదేవ్‌పూర్ పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, స్థానిక నాయకులు నర్సింలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచు వివాహానికి పుస్తెలు, మెట్టెలు అందజేత

**జగదేవ్‌పూర్, మే 31 (ప్రభాతవార్త):** మండలపరిధిలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ కదుర్ల లక్ష్మి, మల్లయ్యల కూతురు సంధ్య వివాహం బుధవారం జరుగగా విషయం తెలుసుకున్న సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాచర్ల నరేష్ పుస్తెలు, మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఆడపడుచు వివాహానికి ఉచితంగా పుస్తెలు, మెట్టెలను అందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అన్నెబోయిన కనకయ్య, కొంతం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**తొగుట, మే 31, ప్రభాతవార్త :** సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి అదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. వెంకటరావుపేట గ్రామంలో బుధవారం మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అదేశాల మేరకు విద్యార్థి, యువజన, సోషల్ మీడియా కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామ యూత్ అధ్యక్షునిగా ఎంగలి నరేందర్, సోషల్ మీడియా అధ్యక్షునిగా బెజ్జనమైన నవీన్, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా రేపాక రాజులను నియమించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు కంకణాల నర్సింహులు, పాత్కుల వెంకటేశం,మాదాసు అరుణ్‌కుమార్, పాత్కుల బాలేష్, సుతారి రాములు, పర్శరాములు, అనిల్ కుమార్, రమేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, కృష్ణ, అశోక్, నిఖిల్, రాంబాబు,అజాం, గణేష్, భాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## వీఓఏల సమ్మె తాత్కాలికంగా వాయిదా

**సమస్యలు పరిష్కరించకుంటే తిరిగి యధావిధిగా సమ్మె**



మాట్లాడుతున్న ఎల్‌బీ రమ

**సిద్దిపేట రూరల్, మే 31, ప్రభాతవార్త :** 44 రోజులుగా ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మెను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రవల్లి దయాకర్‌రావు, డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎల్‌వీ రమ తెలిపారు. సిద్దిపేటలో శక్తి ఫంక్షన్‌హాలులో బుధవారం ఏర్పాటు చేసిన ఐకేపీ, వీఓల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వీఓఏలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వడంతోపాటు సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీఎం కేసీఆర్‌తో చర్చించి వీఓల సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకం వుందన్నారు. వీఓఏల సమస్యలను పరిష్కరించకుంటే తిరిగి సమ్మె యధావిధిగా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, ఎల్లయ్య, గోపాల స్వామి, రవి కుమార్, రాజు, కనకయ్య, భవాని, లత, మహేష్, మమత, విజయ్ కుమార్, లావణ్య, నిఖిత, మంజుల, యమున, కిష్టయ్య, వంశీ, క్రాంతి, అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందిస్తున్న కార్మికులు

**కొండపాక, మే 31, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బర్మ కొమురయ్య అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, గ్రామపంచాయతీ నుంచి కాకుండా ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంటు కేటాయించి కార్మికుల ఖాతాలో జమ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి జూన్ 15వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పీఆర్‌సీ వర్తింపజేసి జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, జనాభా ప్రకారం కార్మికులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ వేతనాలు, సబ్బులు, నూనెలు, ఇతర పని ముట్లు ఇవ్వాలని కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు అరుట్ల నర్సింహులు,జాలిగామప్రభాకర్, పల్లె శ్రీనివాస్, నీరటి కలవ్వ, దబ్బెట సుధాకర్, ఐలయ్య, గొడుగు నారాయణ, చంద్రం, లక్ష్మి, లావణ్య,పుష్ప, సునీత, మల్లేశ్, పోచయ్య, రాజు, నర్సయ్య, కనకవ్వ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## పందిల్లలో సురమాంబ కంఠమహేశ్వరస్వామి విగ్రహావిష్కరణ

**హుస్నాబాద్ రూరల్, మే 31, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి వారోత్సవాల్లో భాగంగా బుధవారం గౌడ సురమాంబ కంఠ మహేశ్వస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహనికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమాభిషేకంతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి తోడేటి భూమయ్య జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మల్లారెడ్డిపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

**వర్గల్, మే 31 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, మల్లారెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంబిక, గ్రామస్తులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్టాపనకు హాజరుకావాలని వీరశైవలింగాయత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ బాధ్యుల దృశ్యం

## విగ్రహ ప్రతిష్టాపనకు నర్సింలుకు ఆహ్వానం

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** మండలంలోని ఆరూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరు కావాలని వీరశైవ లింగాయత్ వర్కింగ్ ప్రెసిడెంట్, సూర్యోదయ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇప్పపల్లి నర్సింహులును శ్రీ వెంకటేశ్వర కాలభైరవ దేవాలయ కమిటీ బాధ్యులు ఆహ్వాన ప్రతికను అందిస్తూ ఆహ్వానించారు. గ్రామంలో మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కొనసాగే ఉత్సవాలకు హాజరై స్వామి వారిని దర్శించుకోవాలని బాధ్యులు సూచించారు. ఉత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని ఉత్సవ నిర్వాహకులు మాజీ ఎంపిటిసి సభ్యులు శివకుమార్, సదాశివుడు, సిహెచ్ శంకర్‌లు వివరించారు.

## ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ


రాజును సన్మానిస్తున్న హనుమాన్ ఆలయ కమిటి బాధ్యుల దృశ్యం

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చేశారు. ఆలయ కమిటి వారి వినతి మేరకు ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందని, ఆలయ గుడి స్లాబ్‌కు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని హామి చేశారు. పులిమామిడి రాజును ఆలయ కమిటి బాధ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

**పాపన్నపేట, మే 31, ప్రభాతవార్త:** చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని డాక్య తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం... తండాకు చెందిన మునోత్ లక్ష్మణ్ (27) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోసిస్తున్నాడన్నారు. తన చెల్లెలు, తన వివాహం కొరకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదన చెందుతూ మే 26న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడన్నారు. తండా శివారులోని అటవీ ప్రాంతంలో పురుగుల మందు సేవించి అక్కడే పడిపోయాడన్నారు. అటుగా వెళ్లిన వారు యువకుడి శవాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెదక్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తిరిగిరాని లోకాలకు చేరిపోయడన్నారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## ముదిరాజ్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్ కన్వీనర్ జగన్

**అల్లాదుర్గం, మే 31, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంమైన మెదక్‌లో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న ముదిరాజ్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి జగన్ అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో ముదిరాజ్ సంఘం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఒక ఎకరా 20 గుంటల్లో నిర్మించే నూతన ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు తన్నీరు హరీష్‌రావు,శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్,ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేతులమీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల ముదిరాజ్ బంధువులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రంలో మెదక్ జిలా ప్రధాన కార్య దర్శి టి సురేష్, అల్లాదుర్గం ముదిరాజ్ సంఘం నాయకులు దొంత లక్ష్మ య్య, కొన్నాల బుచ్చయ్య, కనకంటి భూమయ్య, జి సాయిలు, భీమయ్య, మధుసూదన్, లింగం, రవి, రాజు,బేతయ్య పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

మండల ప్రత్యేక అధికారి స్వప్న


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి స్వప్న

**హత్నూర మే 31,ప్రభాతవార్త:** రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాలను ఉత్సహాభరిత వాతవరణంలో ఘనంగా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని హత్నూర మండల ప్రత్యేక అధికారిణి స్వప్న అన్నారు. హత్నూర మండలంలోని వివిధశాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో బుదవారం హత్నూరలోని రైతువేదిక సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రఆవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈసందర్బంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జూన్ 2నుండి 22వరకు జరిగే ఉత్సవాలలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల వివరాలు,వాటిని ఆమలు చేయాల్సిన విధానం గురించి అధికారులకు వివరించారు.దశాబ్ది ఉత్సవాలలో ప్రజాప్రతినిధులను, ప్రజలను.యువకులను, మహిళా సంఘాల సభ్యులను బాగస్వాములను చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారిణి సూచించారు. సమావేశంలో ఎంపిడిఓ శారధాదేవి, ఎంపిఓ సువర్ణ,వివిదశాఖల మండలఅధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఎమ్మెల్యే టికెట్ రాజుకే ఖాయం

గ్రామాల్లో రాజు అనుచరుల ప్రచారం

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** నిరంతరం నియోజకవర్గ ప్రజాసేవలో ఉన్న పులిమామిడి రాజుకు రానున్న శాసనసభ ఎన్నికల్లో సంగారెడ్డి శాసన సభ స్థానం నుంచి బిఆర్‌ఎస్ తరఫున బి ఫాసం వస్తుందని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు అనుచరులు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సదాశివపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పులిమామిడి రాజు అభిమానులు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపుంచుకుంటూ, పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ, కులమతాలకు అతీతంగా ఆద్యాత్మక కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్న రాజుపై పార్టీ అధిష్టానినికి పూర్తి స్థాయిలో నమ్మకం కల్గిందని, ఎమ్మెల్యే టికెట్ అందించేందుకు అదిష్టానం సుముఖంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతికి స్వంత ఖర్చులు వెచ్చించి కృషి చేసిన రాజుకు ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.


వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్

## లారీలు పంపరు.. ధాన్యం తూకం చేయరు

-రైతుల కష్టాలపై కాంగ్రెస్ అధ్యక్షులు సీరియస్

**చౌటకూరు, మే 31, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంతో రైతులకు ఒరుగుతున్న ప్రయోజనం ఏమి లేవని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దశరథ్ మండిపడ్డారు. బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి పరిశీలించి ప్రభుత్వ తీరు, స్థానిక శాసన సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ ప్రకటిస్తున్నా కేంద్రానికి రైతులు తరలించిన ధాన్యాన్ని తూకం చేయకుండా కేంద్రంలో ఉంచితే వర్షాలకు తడిసిపోవా అని మండిపడ్డారు. స్థానిక శాసన సభ్యులు ఫోటోలకు ఫోజు లిస్తూ ఫోటోలు దిగడమే తప్ప రైతుల ధాన్యం తూకం లారీలను అందుబాటులో ఉంచి రైతుల ఖాతాల్లో వరి డబ్బులు జమచేయించిన పాపనపోలేదని విచారం వ్యక్తం చేశారు. రైతులు కొనితెచ్చుకున్న టార్ఫిన్‌లనే ఎమ్మెల్యే పత్రికల్లో వార్తల కోసం ధాన్యంపై కప్పారు తప్పితే టార్ఫిన్‌లను సైతం ప్రభుత్వం సబ్సిడీపై అందించకపోవడం విడ్డూరంగా ఉందని విరుచుకుపడ్డారు. రెం డు, మూడు రోజుల్లో రైతుల కష్టాలను కడతేర్చకుంటే జాతీయ రహదారి 161ని రైతులతో కలిసి దిగ్బంధం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక శాసన సభ్యులు ధాన్యంపై రైతులు తెచ్చుకున్న కవర్లు కప్పడం మానుకుని ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యంను కొనుగోలు చేసేలా చొరవ తీసుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కాలాలి రామాగౌడ్, మండలెస్‌సి సెల్ అధ్యక్షులు వరకాల రమేష్, కాంగ్రెస్ నాయకులు వర్కల రమేష్, కాజీమ్ పంతులు, శ్రీనివాస్ ముదిరాజ్, మహేందర్‌రెడ్డి, ఆంజనే యులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘు, కృష్ణ, శివయ్య, రైతులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రీకులను సన్మానించిన నరోత్తం


హజ్ యాత్రీకులను సన్మానిస్తున్న టిపిసిసి నేత నరోత్తం దృశ్యం

**జహీరాబాద్, మే 31, ప్రభాతవార్త:** పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న యాత్రీకులను టిపిసిసి నేత వై నరోత్తం ఘనంగా సత్కరించారు. మంగళవారం రాత్రి ముస్లిం యాక్షన్ కమిటి అధ్యక్షులు మహ్మద్ యూసుఫ్ నివాసంలో హజ్ యాత్రీకుల కొరకు విందును ఏర్పాటు చేశారు. విందు కార్యక్రమానికి హాజరైన నరోత్తం యాత్రీకులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్బంగా నరోత్తం మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్రకు చేరుకున్నాక జహీరాబాద్ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా అల్లాను వేడుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు వినతి చేశారు. మండల కో-ఆప్షన్ సభ్యులు మైనోద్దిన్, మహ్మద్ మహిజోద్దిన్, వై తరుణ్, మహ్మద్ షరీఫ్, శ్రీకాంత్, మహ్మద్ అయూబ్, అబ్దుల్ సత్తార్, మహ్మద్ మక్బుల్, ఎజాజ్ పాషా, మహబూబ్ గోరి, మహ్మద్ అఫ్జల్, మహ్మద్ షీఫ్, నస్రుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

అధికారుల సమీక్షా సమావేశంలో డిఎల్‌పిఓ యాదయ్య


సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు తదితరులు

**నర్సాపూర్, మే 31.ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతంతచేయాలని డిఎల్‌పిఒ యాదయ్య పేర్కొన్నారు. బుదవారం నర్సాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోఎంపిడిఓ మార్టిన్ లూథర్ అధ్వర్యంలో జూన్ నెల 2 నుండి 22 వ రకు ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై అధికారులతో,ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిరహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న డిఎల్‌పిఒ యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను 21 రోజుల ఎటు నిర్వహిస్తుందని తెలిపారు. ఈమేరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో నిర్వహించివల్సిన బాధ్యతలను, విధుల వివరాలను వారికి వివరించారు.గ్రామాలోని సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితర నాయకులు ఈ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.ఈ ఉత్సవాల్లో బాగంగా వారికి కేటాయించిన విధులను తప్పక నిర్వర్తించి ఈ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో డిఎల్‌పిఓ యాదయ్య తో పాటుఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, జడ్పిటీసి బాబ్యానాయక్, ఎంపిడిఓ మార్టిన్‌లూధర్,ఎంపిఓ వైద్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పదోన్నతులు, బదిలీల్లో జాప్యం తగదు : తపస్

**మెదక్ మున్సిపాలిటీ, మే31 ప్రభాతవార్త:** పదోన్నతులు, బదిలీల్లో జాప్యం తగదని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని తపస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నందున సకాలంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్, రాష్ట్ర బాధ్యులు ఆర్‌వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.


దశాబ్ది ఉత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపిపి చైతన్య విజయభాస్కర్‌రెడ్డి

## దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం

-ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎంపిపి పిలుపు

**పుల్కల్, మే 31, ప్రభాతవార్త:** జూన్ 2 తారీఖు నుంచి ప్రారంభం అయ్యే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ వంతు కృషి సల్పాలని ఎంపిపి అధ్యక్షులు చైతన్య విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని రైతు వేదికలో ఉమ్మడి పుల్కల్ మండల ప్రజాప్ర తినిధులు, ఆయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయి ఉత్సవాలను విజయవంతంగా జరుపుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తయి దశాబ్దంలోకి అడుగు పెడుతుంటం ఆనందంగా ఉందని, 9 సంవత్సరాలో తెలంగాణ అభివృద్ధిలో రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, చోట చేసుకున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రోజుకో కార్యక్రమంలో ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మధులత, పుల్కల్, చౌటకూరు తహసీల్దార్‌లు రాజయ్య, కిష్టయ్య, వ్యవసాయ అధికారి చైతన్య, మండల రైతు బంధు సమితి నాయకులు నర్సింహారెడ్డి, ఆత్మ కమిటి చైర్మన్ యాదగిరిరెడ్డి, నాయకులు విజయకుమార్, అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇక్రిసాట్ కాంట్రాక్టు కార్మికులు ధర్నాకు శ్రీనివాస్‌గౌడ్ మద్దతు


కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

**పటాన్‌చెరువు, మే 31, ప్రభాతవార్త:** ఇక్రిసాట్ కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం చేపట్టిన ధర్నాలో పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్ బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం వెంటనే కార్మికుల వేతనం మరియు ట్రాన్స్‌పోర్ట్ సమస్యలను పరిష్కరించాలని లేదంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందుంటుందని హామీనిచ్చా రు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్‌టిసి జనరల్ సెక్రెటరీ ఆర్.డి.చంద్రశేఖర్, 111 డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఆర్‌సిపురం మహిళా ప్రెసిడెంట్ శాంతమ్మ, రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, పీటర్, రెహమాన్, నవీన్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, అజారుద్దీన్, పాషా, హమీద్, సామ్రాట్, నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో శ్రీ మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

**నర్సాపూర్, మే 31.ప్రభాతవార్త:** మండల పరిదిలోని గొల్లపల్లి గ్రామంలోని శ్రీ కేతకీ బ్రమరాంబిక సహిత మల్లికార్జనస్వామి ఆలయంలో బుదవారంఈ ఆలయం నెలకొల్పి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగాఈ ఆలయ నిర్మాణదాత, నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ దంపతులఅధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా శ్రీ కేతకీ సహిత బ్రమరాంభిక మల్లికార్జున స్వామికిఆలయ పూజారి హరిచరణ్‌శర్మ వేద మంత్రాల మధ్యన శ్రీ మల్లికార్జునస్వామికి దుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, నమకం, చమకం,బిల్వ పత్రాలతో ప్రత్యేక పూజలు చేయడంతో తో పాటు ఆలయ నిర్మాణదాత, నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ దంపతుల అధ్వర్యంలో పది రకాల పండ్లతో మహా నైవేద్యం సమర్పించారు.ఈ సందర్బంగా ఆలయ నిర్మాణదాత, నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ ఈఆలయం నిర్మించినప్పటి నుండి ఇప్పటి వరకు నిత్య పూజలు, జాతర మహోత్సవాలు, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు.ప్రతి సంవత్సరం దుద్రాబిషేకాలు ,పత్రిపూజ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ మేరకు ఎల్లప్పుడు ప్రజలనందరిని చల్లంగా చూడాలని ఆ మల్లికార్జున స్వామిని వారు వేడుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత,నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, ఆలయ పూజారి హరిచరణ్ శర్మ ,భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో పలువురు చేరిక


కండువాలు కప్పిబిజెపిలోకి ఆహ్వానిస్తున్నబిజెపి కన్వీనర్ మల్లేష్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్,నర్సాపూర్ రూరల్, మే 31.ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల పరిధిలోని ఎర్రకుంటతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బాల్యానాయక్ తండావాసులు పలువురు బిజెపి పార్టీలో చేరారు. బాల్యానాయక్ తండాకు చెందిన వార్డు సభ్యులు జగన్, గోపి, సురేష్, దేవుల తో పాటు వంద మంది బిజెపి పార్టీలోచేరడం జరిగింది. ఈ మేరకు పార్టీలో చేరిన వారిని నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వల్దాస్ మల్లేష్‌గౌడ్ అధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి,రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డిల చేతుల మీదుగా బిజెపి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు గుండం శంకర్, మండల బిజెపి ప్రదాన కార్యదర్శి నాగేశ్‌గౌడ్,పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, పట్టణ ప్రదాన కార్యదర్శి బాల్‌రాజు,నాయకులు ఎల్లం,భూత్ అధ్యక్షులు మణిగౌడ్, మల్లేష్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

**న్యాల్‌కల్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని ప్రతి గడపకు చేరాయని జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని జహీరాబాద్-బీదర్ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 19 గ్రామాల (హద్నూర్ సొసైటీ పరిధిలోని గ్రామాలు) బిఆర్‌ఎస్ బాధ్యులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాణిక్‌రావును పార్టీ శ్రేణులు జగమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల ఆదరణతోనే ప్రభుత్వం సంక్షమ పథకాలను అందిస్తోందన్నారు. గత ప్రభు త్వాల హయాంలో తమ పార్టీ వారికే పథకాలు అందేవని, మధ్య దళారులు లేకుండా పథకాలు అందిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మధ్య దళారులు లేకుండా, నాయకులు సిఫారసు లేకున్నా అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందుకుంటున్నారని గుర్తు చేశారు. పార్టీ కార్యకర్త మృతి చెందితే 2 లక్షలు, రైతులు కానరాని లోకాలకు చేరితే 5 లక్షలు. వ్యవసాయ పెట్టు బడికి రైతు బంధు, పేదల పెళ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, పంటల సాగుకు రౌండ్ ద క్లాక్‌గా నాణ్యమైన విద్యుత్ సరపరా, రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహించిన ఘనత


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు దృశ్యం

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కు తుందన్నారు. గ్రామాల్లో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని, వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మాతంశెట్టి రాజ్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రవి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పీటర్ రాజు, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న భాస్కర్, నాయకులు యంఆర్ ప్రవీణ్‌కుమార్, పాండురంగారావు పాటిల్, పాండురంగారెడ్డి, వీరారెడ్డి, నిరంజన్‌రెడ్డి, దేవదాస్, మైపాల్, వెంకట్, చంద్రన్న, వెంకట్‌రెడ్డి, మారుతి, ఇమ్రాన్, తుక్కారెడ్డి, నర్సప్ప, వినోద్ కుమార్, శ్రీని వాస్, బక్కారెడ్డి, షబ్బీర్ ఖాన్, షకీల్, గౌస్ పాల్గొన్నారు.

## పాఠాలు బోధించేందు ఉపాధ్యాయులకు ఆహ్వానం

**జహీరాబాద్, మే 31, ప్రభాతవార్త:** మండలంలోని హోతి(కె) గ్రామంలోని తెలంగాణ గురుకుల విద్యాలయం, కళాశాలలో విద్యార్థులకు పాఠాలో బోధించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల కోసం అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించేందుకు, పాఠశాలలో ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, సంస్కృతము, బయోలజీ, పిఈటిల కొరకు అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు జూన్4వ తారీఖు లోగా హోతి(కె) గ్రామంలోని తెలంగాణ గురుకుల పాఠశాల నందు ధరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9908228400ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

## నంది కందిలో ధాన్య మందిర నిర్మాణానికి శ్రీకారం


నంది కందిలో ధ్యాన మందిర నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దృశ్యం

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** మండలంలోని నంది కంది గ్రామంలో శ్రీ రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో 25లక్షలతో నిర్మించనున్న ధ్యాన మందిర నిర్మాణం పనులను సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీస్ రావు ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటి బాధ్యులు వినతి మేరకు 25లక్షల రూపాయలను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆలయ అభివృద్దికి మరి కొంత నిధులు కావాలని కమిటి బాధ్యులు వివరించగా 15లక్షల రూపాయలు మంజూరు చేయిస్తానని మాట ఇచ్చానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుందేన రాజు, ఎంపిటిసి సభ్యులు సునీత సుధాకర్, ఆహ్మద్, ఎంపిపి తొంట యాదమ్మ కిష్టయ్య, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, పిఆర్ డిఈఈ దీపక్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మునిగె నవీన్, సర్పంచ్‌లు నల్లుల కుమార్, దశరథ్, శేఖర్, అశోక్, చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి సభ్యులు పేట శ్రీనివాస్, విజయ భాస్కర్‌రెడ్డి, అంజన్న, వర్కల రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు రాము, రాఘవేందర్, సర్వేశ్వర్, నరసింహారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, ఆలయ కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## కార్దనూర్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**పటాన్‌చెరువు, మే 31, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా భానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ సాయిలు తెలిపారు. ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం కర్దనూర్ గ్రామ శివారులోని ఐచర్ పరిశ్రమ ప్రక్కన పిచ్చి మొక్కల్లో మిగతాజీవిగా పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి వయస్సు 30 నుండి 40 సంవత్సరాల మధ్యలో గల వ్యక్తి ఒకరోజు క్రితం చనిపోయి ఉండవచ్చని, ఎడవ చాతి వైపు అమరావతి, కుడి చాతి వైపు మధు మేఘన పచ్చ బొట్టుతో పేర్లు ఉన్నాయని బూడిద రంగు పాయింట్ ధరించి ఉన్న ఈ వ్యక్తి యొక్క సమాచారం ఎవరికైనా తెలిస్తే భానురు పోలీస్‌స్టేషన్ 8712656727, 8712581496 ఫోన్ చేసి తెలుపాలని పేర్కొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలను పక్కాగా నిర్వహించాలి

- ఎంపిపి, తహశీల్దార్, ఎంపిడిఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

**గుమ్మడిదల, మే 31, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అధికారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి సిద్ది ప్రవీణ్ విజయభాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ సుజాత హాజరయ్యారు. అనంతరం అధికారులకు రోజువారీగా చేయవలిసిన కార్యక్రమాలను వాటి వివరాలను దిశానిర్దేశాలను వివరంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామ గ్రామాలలో పండగ వాతావరణంలో ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి, గుమ్మడిదల మండల ప్రజల పండగ ఏ విధంగా ఉంటుందో చేసి నిరూపించాలని కోరారు. ప్రతి ఒక్క అధికారి, నాయకులు, కార్యకర్తలు తన సొంత ఇంటి పండగల ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాల కార్యదర్శులు, నాగిరెడ్డిగూడెం సర్పంచ్ హనుమంత్‌రెడ్డి ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా తెలంగాణ ప్రగతిని చాటాలి

**శివ్వంపేట, మే31 ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ప్రతి గ్రామ గ్రామాన విజయవంతం చేయాలని ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ పిలుపునిచ్చారు. శివ్వంపేటలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి చేస్తున్న ప్రగతిని, ప్రజలు అందుకుంటున్న ప్రభుత్వ ఫలాలను వివరిస్తూ ఈ నెల 2 నుండి 22వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రతి కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. 2వ తేదీన జాతీయ జెండా ఆవిష్కరణ, 3వ తేదీన తెలంగాణ రైతు దినోత్సవం, 4న సురక్షా దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ, 9న సంక్షేమ సంబరాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమం, 14న వైద్య ఆరోగ్యం, 15న పల్లె ప్రగతి, 16న పట్టణ ప్రగతి, 17న గిరిజనోత్సవం, 18న మంచినీళ్ల పండుగ, 19న హరితోత్సవం, 20న విద్య, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, చివరగా జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమాలు ఉంటాయని, ప్రతి కార్యక్రమాన్ని కూడా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలను భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నర్సయ్య తహశీల్దార్ శ్రీనివాసచారి, ఎస్ఐ రవికాంత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారిణి లావణ్య, ఇంచార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, డాక్టర్ సాయిసౌమ్య, పశు వైద్యాధికారిణి జె. సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ